ప్రజాశక్తి
గురువారం 10 నవంబర్ 2022 5
శ్రీ సత్యసాయి

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ఓటు హక్కు అభివృద్ధికి పునాది

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

18 సంవత్సరాల నిండిన యువతి యువకులకు ఓటు హక్కు దేశ సంక్షేమానికి అభివృద్ధికి పునాది లాంటిదని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం పుట్టపర్తి మండలం బీడుపల్లి లోని సంస్కృతి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణను విడుదల చేసిన నేపథ్యంలో ఓటరు జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, తప్పుగా ఉన్న పేర్లు, చిరునామాలు ఇతర విషయాలను సవరణ చేసేందుకు వెసులుబాటు ఉందని తెలిపారు. అలాగే నూతన ఓటరు నమోదుకు ఫారం -6 ,ఓటరు జాబితా నుండి పేరు తొలగింపు కోసం ఫారం - 8 అలాగే నివాస ప్రాంతం అడ్రస్ మార్పు కొరకు ఫారం -8 ఏ ను వినియోగించ కోవచ్చునని కలెక్టర్ సూచించారు అర్హత కలిగిన వారందరూ కూడా ఓటు నమోదు చేసుకోవాలని ఇది నిరంతర పక్రియఅని తెలిపారు. నియోజకవర్గ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన బిఎల్ఒల ద్వారా ఓటు నమోదు, ఆధార్ లింకేజీ , ఆన్లైన్ ద్వారా ఓట్ల నమోదు పక్రియ గురించి కలెక్టర్ వివరించారు. నేటి యువత విద్యతోపాటు నైతిక విలువలను పెంపొందించుకున్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దేశం, రాష్ట్రం ,జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే ప్రజలకు సుపరిపాలన అందించే ఒక మంచి లక్షణాలు కలిగిన అభ్యర్థిని ఎన్నికల సమయంలో ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవాలన్నారు. సమాజంలోని విద్యావంతులు, ప్రజలు ఓటు విలువ తెలుసుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు. జిల్లాలో సుమారు 20 లక్షల మంది జనాభా కలిగి ఉండగా ఇందులో 13 లక్షల మంది ఓటర్లు నమోదు అయినట్లు గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. రాబోయే జనవరి మాసంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నాటికి ఓటరు గుర్తింపు ఎపిక్ కార్డు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. వచ్చే అన్ని ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గత రెండు మాసాలుగా రూపొందించిన ఓటర్ల సవరణ జాబితా జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, పుట్టపర్తి తహశీల్దార్ దేవేంద్ర నాయక్, ఎన్నికల విభాగం తహశీల్దార్ నరసింహులు, స్పందన తహశీల్దార్ గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్. సింధిల్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ నాగరాజు, హెచ్ఒడి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేద రైతుపై ప్రభుత్వ అక్కసు కొనసాగుతూనే ఉంది. తన కుటుంబం మొత్తం ఆధారపడి జీవిస్తున్న భూమిని నాసిన్ కంపెనీకి ఇవ్వను అన్నందుకు ఆ రైతును కక్షపూరితంగా ఇబ్బందులు పాలుజేస్తున్నారు. రెండు రోజులుగా పోలీసులు, రెవెన్యూ అధికారుల చేత ప్రభుత్వం ఆ కుటుంబాన్ని మొత్తం అవస్థలు పెడుతోంది. పలు పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ భయభ్రాంతులకు గురి చేస్తోంది. పొలం చుట్టూ అధికారులు అక్రమంగా ఇనుప ఫెన్సింగ్ వేసి రైతు కనీసం అందులోకి వెళ్లేందుకు కూడా వీల్లేకుండా చేశారు. సోమందేపల్లి మండలంలోని కావేటినాగసముద్రం గ్రామం పరిధిలో రామయ్య అనే రైతు తన పొలాన్ని నాసిన్ సంస్థకు ఇవ్వను అన్న పాపానికి అధికారులు పెడుతున్న కష్టాలు ఇవి. కార్పొరేట్ మెప్పుకోసం ప్రభుత్వం పేద రైతును ఇబ్బంది పెడుతున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పొలం చుట్టూ కంచె వేయడంతో లోపలికి వెళ్లలేక బయట నిల్చొన్న రైతు రామయ్య దంపతులు


తనకు న్యాయం చేయాలంటూ చేతులు జోడించి వేడుకుంటున్న రైతు రామయ్య

పేద రైతుపై.. ఆగని అక్కసు

- భూమి ఇవ్వనన్నందుకు ఇంటి చుట్టూ ఫెన్సింగ్
- పోలీసు జీపులో ఎక్కించుకుని రాత్రంతా చక్కర్లు
- బలవంతంగా భూమి లాగేసుకునే యత్నం
- రెండు రోజులుగా రైతు రామయ్య కుటుంబానికి నరకయాతన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కావేటినాగసముద్రం గ్రామానికి చెందిన రామయ్యకు ఉన్న ఏకైక జీవనాధారం 3.36 ఎకరాల వ్యవసాయ పొలం. నాసిన్ కంపెనీ ఏర్పాటు పేరుతో ఈ రైతు నుంచి భూమిని నిబంధనలకు విరుద్ధంగా అధికారులు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై రైతు హైకోర్టుకు వెళ్లారు. కోర్టు రైతుకు న్యాయం చేసిన తరువాతనే భూమి తీసుకోవాలని తీర్పు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు రోజులుగా పోలీసు, రెవెన్యూ అధికారులు మొత్తం ఆ రైతును ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నారు. రైతు తన తోట చుట్టూ వేసుకున్న ఇనుప ఫెన్సింగ్‌ను మంగళవారం నాడు అధికారులు తొలగించారు. అడ్డుకోబోయిన పేద రైతు రామయ్య, ఆయన భార్యను రాత్రి సమయంలో పోలీసు జీపులో ఎక్కించుకుని బుధవారం తెల్లవారు జామున 3-30 గంటల వరకు ఒక్క చోట ఉంచకుండా సోమందేపల్లి, పెనుకొండ, గోరంట్ల ఇలా వివిధ పోలీసు స్టేషన్లకు మారుస్తూ చక్కర్లు కొట్టారు. కుటుంబ సభ్యులకు సైతం సమాచారం ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురి చేశారు. రైతును పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూనే అంతలోపు అతని పొలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి, ఇంటికి ఆనుకుని ఉన్న రహదారి వరకు అధికారులు ఇనుప ఫెన్సింగ్ వేసి కనీసం దారి లేకుండా చేసేశారు. ఈ పనులు అన్నీ పూర్తయ్యాక బుధవారం తెల్లవారుజామున రామయ్యను పోలీసులు వదిలేశారు. తన పొలంలోకి వెళ్లేందుకు వీల్లేకుండా ఇంటి వద్ద పహారాను ఏర్పాటు చేశారు. అధికారులు బాధితులుగానున్న వారినే దౌర్జన్యంగా పోలీసు జీపులో తరలించి, ఇంట్లోకి జొరబడి సామాన్లు అన్నింటినీ చిందరవందరగా పడేసి భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.


పోలీసుల దాడుల అనంతరం రైతు రామయ్య ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న దుస్తులు, వస్తువులు

పొలం, ఇంటి చుట్టూ కంచె వేయడంతో రోడ్డుపై ఉన్న రామయ్య కుటుంబ సభ్యులు

ఇంట్లోకి పోనీయ్యడం లేదు..

రామయ్య, బాధిత రైతు.

నాసిన్ సంస్థకు భూమి ఇవ్వను అన్నందుకు తనను బలవంతంగా పోలీసు జీపులో ఎక్కించుకునిపోయి, నా ఇంటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇంట్లోకి కూడా వెళ్లేందుకు వీల్లేకుండా చేశారు. పశువులు కూడా లోపలే ఉన్నాయి. వాటికి మేత వేసేందుకు కూడా వీల్లేకుండా పోలీసులు అడ్డుపడుతున్నారు. పేదలకు న్యాయం చేయాల్సిన అధికారులే ఈ రకంగా దౌర్జన్యంగా మా భూమిని లాగేసుకోవడం చాలా అన్యాయం. ఈ విషయంపై న్యాయస్థానంలోనూ ఇంకా కేసు నడుస్తోంది. అంతలోపే అధికారులు ఈ రకంగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కటుంబానికున్న ఏకైక జీవనాధానం ఈ భూమే. దీన్ని ఈ రకంగా ప్రభుత్వమే దౌర్జనంగా లాగేసుకుంటే మా బాధ ఎవరితో చెప్పుకోవాలి.

కోర్టు మార్గదర్శకాలనూ పట్టించుకోలేదు..

పేద రైతు రామయ్య భూమిని బలవంతంగా సేకరించవద్దని న్యాయస్థానం చెప్పింది. న్యాయస్థానం ఆయనతో మాట్లాడి, ఆయన అంగీకారంతో తీసుకోవాలని మార్గదర్శకాలు జారీ చేసింది. దాన్ని కూడా అధికారులు పట్టించుకోకుండా దౌర్జన్యంగా రెవెన్యూ, పోలీసు అధికారులు రైతు కుటుంబాన్ని ఇబ్బందులు పెడుతున్నారు. ఇది సరైంది కాదు.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ చేయాలిగాని, బలవంతంగా పేద రైతుల నుంచి భూములు లాక్కోడం అన్యాయం.

పెద్దన్న,
ఎపి వ్యవసాయ కార్మికక సంఘం జిల్లా కార్యదర్శి.

జిల్లాలో 34,741 హెక్టార్లకు

డ్రిప్. స్ప్రింక్లర్ల సౌకర్యం

ప్రజాశక్తి మడకశిర

సత్యసాయి జిల్లాలో 34,741 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, ఉద్యాన శాఖ ప్రాజెక్ట్ అధికారి సుదర్శన్ పేర్కొన్నారు. బుధవారం మడకశిర ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మడకశిర నియోజకవర్గంలోని 300 మంది రైతులకు మంజూరైన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను సంబంధిత రైతులకు మంజూరు పత్రంతో పాటు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గం లో ఐదు మండలాల నుండి 5400 మంది రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అందులో మొదటి విడత కింద 300 మంది రైతులకు సబ్సిడీతో ప్రభుత్వం పరికరాలు మంజూరు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ రమణారెడ్డి, ఎడి కృష్ణమీనన్ తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు జమచేయాలి

కొత్తచెరువు : సర్పంచుల ఖాతాలో 15వ ఆర్థికసంఘం నిధులు జమచేయాలని పలువురు సర్పంచులు కోరారు. ఈమేరకు ఆయా గ్రామాల సర్పంచులు రవికుమార్, అలివేలమ్మ, గీతా బాయ్, రత్నమ్మ, ప్రకాష్, నరేందర్ రెడ్డి తదితరులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో సిద్ధారెడ్డికి అందజేశారు. తమ ఖాతాలోనే కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులను జమ చేస్తామని తెలిపిందని అయితే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల అకౌంట్ కు జమ చేసి 50శాతం కరెంటు బిల్లులకు, 25 శాతం పారిశుద్ధ్య కార్మికులకు ఖర్చు చేయాలని సూచించిందని చెప్పారు. తక్షణమే వీటిని రద్దుచేసి తమ ఖాతాల్లో నిధులు జమ చేయాలని వారు కోరారు.

కార్మికుల విజయం : సిఐటియు

ప్రజాశక్తి -పెనుకొండ

పంచాయతీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులు

సిఐటియు పోరాటాల ఫలితంగా పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ కొనసాగింపు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఇది కార్మికుల విజయం అని సిఐటియు నాయకులు పేర్కొన్నారు.కార్మికుల హెల్త్ అలవెన్స్ సమస్యను నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ దృష్టికి సిఐటియు నాయకులు, కార్మికులు బుధవారం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హెల్త్ అలవెన్స్‌ను కొనసాగింపు చెయ్యాలని ప్రభుత్వం హామీ ఇచ్చిందని కమిషనర్ తెలిపారన్నారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ రూ. 6వేలను 2022 సంవత్సరం జనవరి నుండి సెప్టెంబర్ నెల వరకు రికవరీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ట్రెజరీ అధికారుల ద్వారా కమిషనర్లకు నోటిఫికేషన్ పంపించిందన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పారిశుధ్య కార్మికులు గత 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపట్టారన్నారు. దీంతో ప్రభుత్వం దిగి వచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు రిక్షా నర్సింహులు, చిన్న వెంకటేష్, ఈ వెంకటేష్, తిప్పన్న, ముత్యాలు, గజేంద్ర, చంద్ర, సూరి, లక్ష్మీదేవి, శాంతమ్మ, గంగ రత్నమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో వీరసింహారెడ్డి సినిమా ప్రతినిధులు

ప్రజాశక్తి -పెనుకొండ

టిడిపి నాయకులతో వీరసింహారెడ్డి ప్రతినిధులు

హిందూపురం ఎమ్మెల్యే, సినీనటులు నందమూరి బాలకృష్ణ నటిస్తున్న వీరసింహారెడ్డి సినిమా షూటింగ్ ఈ నెల 12, 13 తేదీలలో పెనుకొండ ఫోర్ట్‌లో జరుగనుంది. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి ని వీరసింహారెడ్డి రాయలసీమ ప్రొడక్షన్ మేనేజర్లు సీనాసింగ్, సుబ్రమణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసమూర్తి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి పాలడుగు చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ, సర్పంచి శ్రీనివాసులు, సుబ్బరాయుడు, కృష్ణమూర్తి, నారాయణ నాయక్, గోపాల్ యాదవ్, మైలార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

13 వరకు డిగ్రీ అడ్మీషన్లు

ప్రజాశక్తి గోరంట్ల

ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ చేరే వారికి ఈనెల 13వ తేదీ వరకు గడువు ఉందని ఎస్పీవిఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం తెలిపారు, ఓపెన్ ఇంటర్ విద్యార్థులు, రెగ్యులర్ ఇంటర్ విద్యార్థులు డిగ్రీ చేరడానికి అర్హత ఉందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు తమ కళాశాలలో సంప్రదించి చేరాలని కోరారు.

ప్రజల వద్దకే పాలన : సిద్ధారెడ్డి


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-తనకల్లు

మండల పరిధిలోని కోటపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని మరాలపల్లి, నడిమి తండా, ఏనుగుంటుతండా, గుట్ట మీద తండా, రామప్పకుంట తండా సి జి ప్రాజెక్ట్ గ్రామాలలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు గ్రామంలో గల సమస్యలు తెలుసుకుని అక్కడ గల ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పరిష్కరించదగ్గ సమస్యలను పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్, కొక్కంటి శ్రీనివాసులు నాయుడు, కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, చంద్రమౌళి, సర్పంచి మునే నాయక్, ఎంపీటీసీ వెంకటసుబ్బమ్మ, రామ్ దేశాయ్, నీలకంఠ రెడ్డి, ఎంపీడీవో పూల నరసింహులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి కదిరి టౌన్

క్రీడలతో విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందించుకోవచ్చని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్ టి ఎస్ ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జగనన్న క్రీడా సంబరాలను స్థానిక ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక రుగ్మతలను తొలగించి వికాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్మిత, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ అంజన్న, నియోజకవర్గ కోఆర్డినేటర్ చంద్ర నాయక్, జిల్లా పిడి అసోసియేషన్ అధ్యక్షులు భయ్యా రెడ్డి, సెక్రటరీ లష్కర్ నాయక్, నియోజకవర్గస్థాయి పీఈటీలు, పీడీలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని మున్సిపల్ చైర్పర్సన్ లింగంనిర్మల పేర్కొన్నారు. జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా స్థానిక బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను మున్సిపల్ చైర్ పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్ నాగరాజు, నాయకులు ఉడుములరాము, కేశవరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ నవీన్ కుమార్, పాఠశాల హెచ్ఎం శైలజ, పీడీలు నాగేంద్ర, రఘునాథరావు, హరిప్రసాద్, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో క్రీడాకారులతో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ధర్మవరంలో క్రీడాపోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు..?

ప్రజాశక్తి - కొత్తచెరువు

గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని వాటిని పరిష్కరించేందుకు నిర్ణయాలు తీసుకోలేని సమావేశాలు ఎందుకని మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ సమావేశాన్ని ఎంపిపి గాయత్రి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, విద్యుత్ తదతర సమస్యలను పరిష్కరించాలని గత సమావేశంలో సమావేశం దృష్టికి తీసుకువస్తే ఇప్పటికీ వాటిని పరిష్కరించలేదని విమర్శించారు. స్పందించిన ఎంపీడీవో సిద్ధారెడ్డి మాట్లాడుతూ మండల సమావేశంలో ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సిద్ధారెడ్డి, తహశీల్దార్ రామాంజనేయరెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, జెడ్పీటీసీ గంగాదేవి, వైస్ ఎంపీపీలు సరళ, గంగరాజు, సర్పంచులు రత్నమ్మ, నరేందర్ రెడ్డి, గీతా బాయ్, అలివేలమ్మ, ఎంపీటీసీ సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

ప్రజాశక్తి-ఓబులదేవర చెరువు

మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని ఎంపీడీవో పోలప్ప ఉపాధి సిబ్బందిని ఆదేశించారు జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించే విధంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. తంగేడుకుంట పంచాయతీ ఎర్రబల్లి గ్రామంలో జరుగుతున్న బౌండరీ ట్రెంచ్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండాలని రోజుకు 257 రూపాయలు వచ్చే విధంగా పనులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న బిల్లులు త్వరలోనే కూలీల అకౌంట్లోకి జమవుతాయని తెలిపారు. అనంతరం కొండకమార్ల పంచాయతీలో నాయనా కోట తండా నుండి కుటాలపల్లి వరకు ఉపాది హామీ కింద జరుగుతున్న పనులను తహశీల్దార్ శ్రీధర్ కలిసి ఎంపీడీవో పరిశీలించారు. రైతులు కొందరు రోడ్డు పనులకు అభ్యంతరం చెప్పడంతో వారితో అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సోమశేఖర్ రెడ్డి, సాంకేతిక సహాయకులు రాజారెడ్డి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఖవ్వాలీ

ప్రజాశక్తి-హిందూపురం

ఖవాలీలో పాడుతున్న గాయకులు

హిందూపురం పట్టణ సమీపంలోని లేపాక్షి మండలం నాగేపల్లి వద్ద ఉన్న పీర్ భక్తర్ వలీదర్గా ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నెల్లూరుకు చెందిన అయిషా తాజ్ నిజామి, బెంగళూరుకు తబ్రేజ్ ఖాద్రీల బృందం నిర్వహించిన ఖవాలి కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురువులు అబ్దుల్ రహిమ్, మహబూబ్‌బాషా షబ్బీర్ ఉస్సేన్, పీర్ భక్తర్, వలీ దర్గా కమిటీ అద్యక్షులు మక్తీయార్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సమీవుల్లా, ఆదిరామరెడ్డి, వెంకటరమణప్ప, కిష్టప్ప, షరీఫ్, నిర్వహకులు మహబూబ్ దౌల, నజీర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించండి

తాడిమర్రి : సత్యసాయి వాటర్‌సప్లయ్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాని కార్మికులు కోరారు. సిఐటియు అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు స్థానిక పంప్ హౌస్ వద్ద 13 రోజులుగా ధర్నా చేస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఓబులేసు, సుధాకర్, రామకృష్ణ, తిరుపాలు, ఆచారి రవికుమార్, లక్ష్మి రెడ్డి, లక్ష్మీనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు పంచాయతీకి ఆదాయం

చిలమత్తూరు : కోడూరు గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించిన వేలం పాటలో గ్రామపంచాయతీకి రూ.2.41 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. వేలం పాటలో కోడూరు చెరువు, నల్లరాళ్లపల్లి చెరువు,కోడూరు సంత, ఈత వనం తదితర వాటికి వేలం పాట నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సుభాషిణి, సర్పంచి మురళి, వార్డు మెంబర్లు, వేలం పాట దారులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కదిరి టౌన్ : మండలంలోని కౌలేపల్లి ప్రాథమిక పాఠశాలను కదిరి ఎంపీపీ తోట అమర్నాథ్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. హెచ్ఎం వెంకటనారాయణమ్మ పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేవారు. నాడు నేడు పనులు ప్రారంభించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. నాడు నేడు పనులకు సంబంధించి మెటీరియల్ వస్తువులు పాడైపోతున్న పట్టించుకోకపోవటం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులు జిల్లా కలెక్టర్ పేరుకూడా చెప్పలేకపోతున్నారని దీనిని బట్టి చూస్తే ఇక్కడ విద్యాబోధన ఎలా సాగుతుందో అర్థం అవుతుందని వ్యాఖ్యానించారు. హెచ్ఎం నుంచి సంజాయిషీ కోరాలని ఎంఇఒను ఆదేవించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుధామణి, మధుకర్ రెడ్డి, ఎంఇఒ చెన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అండర్-15 జిల్లా బాలికల జట్టులో కదిరి క్రీడాకారిణి

కదిరి టౌన్ : అండర్ 15 జిల్లా బాలికల జట్టుకు సాధన స్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు కరస్పాండెంట్ గౌస్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఈనెల 8 నుంచి ప్రారంభమైన అండర్ -15 దక్షిణ మండల అంతర జిల్లాల క్రికెట్ పోటీలకు కదిరి సాధన స్కూల్ విద్యార్థిని శాన్విత ఎంపికైందనిస్కూల్ కరెస్పాండంట్ గౌస్, ప్రధానోపాధ్యాయులు సాదిక్, పిఇటి సుధాకర్ తెలిపారు. జిల్లా పోటీలలో మరింత రాణించాలని వారు ఆకాక్షించారు.

అర్హులందరికీ గృహాలు

కదిరి టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికి గృహాలు మంజూరు చేయాలని ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు . బుధవారం కదిరి రూరల్ మండలంలోని కదిరి బ్రాహ్మణ పల్లి, ఎగువపల్లి, కొండమనాయుని పాల్యం, ముత్యాలచెరువు , చిగురుమాని తండా. చౌటితండా పంచాయతీలకు సంబందించి పేదలందరికీ ఇళ్లు పథకంపై హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, ఎంపిడివో సుధామణి , డివిజనల్ పంచాయితీ అధికారి అంజినప్ప , సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధిపనులపై ప్రజావేదిక

సోమందేపల్లి : మండలంలో రెండు రెండు సంవత్సరాలుగా నిర్వహించినఉపాధి హామీ పనులపై సామూహిక తనిఖీ ప్రజావేదికను బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో నిర్వహించారు. జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా నిర్వహించిన పనుల్లో 52 వేల రూపాయల రికవరీ వ్యయాన్ని గుర్తించామనితెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీడీలు శివానంద నాయక్, పక్కీరప్ప, విజిలెన్స్ అధికారి రాజ్ కుమార్, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, మండలంలోని సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

హిందూపురం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రగతి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కళాశాల ఆవరణంలో మహేంద్ర ఫైనాన్స్ సౌజన్యంతో నేస్తం ఆర్గనైజేషన్ ప్రతినిధులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్బంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, నేస్తం ఆర్గనైజేషన్ కో ఆర్డినేట్ మీనా రెడ్డి మాట్లాడుతు అభివృద్ధి, పారిశ్రామికరణ, పెరుగుతున్న వాహనాల వల్ల రోజు రోజుకు పర్యావరణం నాశనం అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నేస్తం ఆర్గనైజేషన్ కిరణ్, మహేంద్ర ఫైనాన్స్ ఉద్యోగులు గిరిబాబు, నాగభూషణ్, గోవింద్ రెడ్డి, వెంకటేష్, మంజునాథ్, ప్రదీప్, సతీష్ రెడ్డి, బాలాజీ, భాస్కర్, నాగభూషణ్, కళాశాల అధ్యాపకులు వెంకటేశులు, శ్రీధర్, పార్వతి, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, ప్రతినిధులు

సబ్సిడీతో విత్తన వేరుశనగ

బత్తలపల్లి : రబీ సీజన్లో వేరుశనగ పంటను సాగు చేసే రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయనున్నట్లు బత్తలపల్లి వ్యవసాయాధికారి ఓబిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రబీ సీజన్లో వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు వారి ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, విద్యుత్ బిల్లు తీసుకొని రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒక్కొక్క రైతుకు గరిష్టంగా మూడు బస్తాలు అందిస్తామన్నారు. ఒక్కొక్క బస్తా ధర 40శాతం సబ్సిడీ పోను రూ. 1.543లు చెల్లించాలన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రామగిరి : మండల పరిధిలోని శేషంపల్లి గ్రామంలో ఉచిత కంటి శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. రవి స్వామిఆధ్వర్యంలో అల్ట్రావిజన్ సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 150 మందిని పరీక్షించారు. 50 మందిని ఆపరేషన్‌ను రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్, అశ్వర్థ నారాయణ, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

డీలర్లు అవినీతికి పాల్పడితే చర్యలు

ఓబుల దేవర చెరువు : స్టోర్ డీలర్లు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని డిస్ట్రిక్ట్ సివిల్‌సప్లై ఆఫీసర్ వంశీకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం మండలంలోని వివిధ చౌకధరల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టోర్ డీలర్లు అవినీతికి పాల్పడుతున్నారని రేషన్ ఇవ్వలేదని పలువురు తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తాము తనిఖీ చేస్తున్నామని చెప్పారు. మండల పరిధిలోని కొండకమర్ల లో మాజీ సర్పంచ్ నారాయణకు చెందిన వేరుశనగకాయల మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచి పది ప్యాకెట్ల ప్రభుత్వ సబ్సిడీ బియాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నల్లగుట్లపల్లిలో స్టోర్ డీలర్ గత నెలకు సంబంధించి సరుకులు పంపిణీ చేయలేదని ఫిర్యాదు రాగా వెళ్లి పరిశీలించారు. సర్వర్ పని చేయకపోవడం వల్ల డీలర్ సరుకులు పంపిణీ చేయలేకపోయారని అక్కడ స్టాక్ ను పరిశీలించగా అన్ని సరిగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు

రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి మడకశిర

రైతు భరోసా కేంద్రంలో పనిచేసే ఉద్యోగులు రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు .బుధవారం డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి పైన మడకశిర ఎడిఎ కృష్ణ మీనన్ ఆధ్వర్యంలో డివిజన్లోని అర్‌బికె అధికారులకు, ఎఇఒలకు, ఎంపిఇఒలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి , జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్‌బికె సిబ్బంది రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, సిబ్బందితో పాటు ఎంపీపీ కవితా సత్యనారాయణ ,వైస్ ఎంపీపీ మూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు గౌడ్, కదిరేపల్లి సర్పంచి నర్సేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చెరువు కట్ట సమీపంలో దెబ్బతిన్న రహదారి

చెరువు కట్టకు పొంచి ఉన్న ముప్పు

ప్రజాశక్తి - పరిగి

పరిగి చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉంది.32 సంవత్సరాల తర్వాత చెరువు నిండింది. ఈ నేపథ్యంలో పరిగి చెరువుకు గండి పడే అవకాశం ఉండటంతో ఇరిగేషన్ ,రెవిన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. చెరువుకట్ట ప్రాంతంలో ఉన్న రహదారిలో నీరు ఇంకడంతో దెబ్బతిని కూలిపోయింది. దీంతో ఇరిగేషన్ అధికారులు అక్కడికి చేరుకుని మరమ్మతులు నిర్వహించి రహదారి రాకపోకలు నిలిపివేశారు. ఇప్పట్లో అయితే ప్రమాదం లేదని త్వరితగతిన మరమ్మతులు నిర్వహిస్తామని వారు చెప్పారు. అయితే చెరువు నీరు ఇంకడంతోనే రోడ్డు దెబ్బతినిందని దీనివల్ల మరింత నష్టం జరిగే అవకాశం లేదని ఇరిగేషన్ డిఇ గోపీ తెలిపారు. తహశీల్దార్ సౌజన్యలక్షితో మాట్లాడి రహదారిని సైతం మూసివేసి వాహనాలను నిలుపుదల చేస్తున్నామని ఆయన చెప్పారు.

రోడ్డెక్కిన సాగు రైతులు

ప్రజాశక్తి రొద్దం

ఎన్నో సంవత్సరాలుగా భూములు సాగు చేసుకుంటున్నామని ఆ భూములకు సంబందించిన పట్టాలు ఇవ్వాలని పలువురు సాగు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కోగిర, కంబాలపల్లి, శాపురం తదితర గ్రామాలకు చెందిన సాగురైతులు బుధవారం నాడు పెనుగొండ పావగడ ప్రధాన రహదారిపై రెండు గంటలసేపు రాస్తారోకో నిర్వహించారు. వీరికి సిపిఎం నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ దాదాపు రెండు వందల మంది కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్నారన్నారు. వారికీ పట్టాలు ఇవ్వాలని కొన్ని నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. రైతుల ఆందోళనకు స్పందించిన తహశీల్దార్ అనంతాచారి మాట్లాడుతూ శుక్రవారం సర్వేయర్ ని పంపించి భూముల్లో కొలతలు వేయించి స్కెచ్ తయారు చేసి పట్టాల పంపిణీని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు, సాగురైతులు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు గంగాధర్, చేతి వృత్తుల సంఘం నాయకులు వెంకటరాముడు, సిపిఎం మండల కార్యదర్శి ఫక్రుద్దీన్, మారుతి, నాగేంద్ర, కిష్టప్ప, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకోలో పాల్గొన్న బాధిత రైతులు

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు, తదితరులు

పెనుకొండ : జాతీయ న్యాయ సేవ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎం.శంకర్రావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ కోరారు. వీరి ఆధ్వర్యంలో స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు కాంప్లెక్స్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 12 వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధికకేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎజిపిఎం భాస్కర్ రెడ్డి ,బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. చంద్రశేఖర్ రెడ్డి, జి.మలిరెడ్డి, డి. నాగరాజు, బి. మోహన్ నాయక్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : ఈనెల 12 న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమంలో అధిక కేసులు పరిష్కరించే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశించారు. డిఐజి సూచనల నేపథ్యంలో జిల్లా ఎస్పీ పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ లోక్ అదాలత్‌లో కాంపౌండబుల్ కేసులు, ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదుర్చే అవకాశమున్న క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, న్యూసెన్స్ కేసులు, గుట్కా, సాండ్ కేసులు పరిష్కారమయ్యే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.

హిందూపురం : ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయమూర్తులు ఆనంద తీర్థ, స్పందన, రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ న్యాయ సేవా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యాయమూర్తులు మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించాలన్న ఉద్దేశంతో లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామన్నారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఎలాంటి వ్యయప్రాయాసలు ఉండవన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు నాగరాజు రెడ్డి, సిద్దు, కృష్ణమూర్తి, వెంకటేష్, శివ శంకర్, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వాహన చోదకులు రహదారి ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీమాతా జయలక్ష్మి డిగ్రీ కాలేజ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీ ఎం వెంకటేశ్వరరావు విద్యార్థులకు ర్యాగింగ్, చట్టం, రోడ్డు ప్రమాదాలు, లైసెన్సులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో న్యాయమూర్తులు కుమారి ఎస్ ప్రతిమ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి పి మీనాక్షి సుందరి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది నరసింహులు, వీరనారాయణ కాలేజ్ ప్రిన్సిపల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లపట్టాలు : జేసీ

ప్రజాశక్తి పుట్టపర్తిఅర్బన్

అర్హత ఉన్న పేదలందరికీ ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్. చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించి కార్యక్రమంలో ఇళ్లపట్టాలు, గృహ నిర్మాణాలపై జిల్లాలోని తహశీల్దార్లతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ నవీన్, ఆర్డీవోలు, డిఆర్ఒ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఇళ్లపట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు 90 రోజుల్లో పట్టాలు మంజూరు చేయాలన్నారు. గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారుడు మరణించి ఉంటే ఆ కుటుంబంలో ఒకరికి పట్టా బదలాయించాలన్నారు. గతంలో ఇచ్చిన స్థలాలు గృహ నిర్మాణాలకు అనుకూలంగా లేకపోతే మరో చోట ఇవ్వడానికి స్థలాలు పరిశీలించాలని ఆదేశించారు. ఎంత భూమి అవసమో గుర్తించి భూ సేకరణ చేయాలన్నారు. ధర్మవరం, కదిరి, హిందూపురం, మడకశిర మున్సిపాలిటీలలో లబ్ధిదారులకు కేటాయించిన లేఅవుట్లలోని గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. రీ సర్వేలో ఎలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి తేవాలన్నారు. ప్రభుత్వం ఇంటి పట్టాలు పంపిణీ, గృహ నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొందని అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

త్వరలో రూ. 2.50 కోట్లతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో ఉన్నా వైసిపి ప్రభుత్వానికి సాధ్యమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా పుర ప్రజలు ఎదురు ఎదురుచూస్తున్న రైల్వే రోడ్డు విస్తరణ పనులకు బుధవారం తొలి అడుగు ప్రారంభమైంది. రూ.85.23లక్షలతో రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు బుధవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు హిందూపురం పురపాలక సంఘంలో ఉన్న అంతర్గత రహదారుల్లో అత్యంత రద్దీగా ఉండే అంతర్గత రహదారి రైల్వే ఫీడర్ రోడ్డు అని అన్నారు. పురపాలక సంఘంలో వైసిపి అధికారం చేపట్టగానే తొలి సంతకం 70 అడుగులతో రైల్వే ఫీడర్ రోడ్డు విస్తరణ పనులపై చేశామన్నారు. అప్పటి నుంచి పనులను వేగవంతం చేసి ఆక్రమణలను గుర్తించడం, సొంత స్థలాలు, భవనాలు కోల్పోతున్న వారికి నష్టపరిహారాలు అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో అందులో నుంచి రూ.85.23లక్షలతో రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణాలు చేపట్టామన్నారు. హిందూపురం పట్టణం అహూడా పరిధిలో ఉండడంతో రైల్వే రోడ్డు అభివృద్ధి కోసం రూ. 2.50 కోట్లు మంజూరు చేయాలని ఇప్పటికే లేఖ రాశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రోషన్, నాగేంద్రబాబు, అయూబ్, మల్లికార్జున, నాగేంద్రమ్మ, వైసిపి నాయకులు లతీఫ్ సెట్, తిమ్మా రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఓటు అందరి హక్కు

ధర్మవరం టౌన్ : ఓటు కార్డు పొందడం ప్రతి ఒక్కరి హక్కు అని ఆర్డీవో తిప్పేనాయక్ అన్నారు. ఈ మేరకు స్థానిక సీతారామయ్య బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సమావేవంలో ఓటు హక్కు. దాని వల్లకలిగే ప్రయోజనాలు అన్న అంశంపై అవగాహన కల్పించారు. అనంతరంఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితాను ఆర్డీవోతోపాటు తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఇన్‌ఛార్జి ఎంఇఒ సుధాకర్‌నాయక్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ అనిల్ కుమార్, కళాశాల అధినేత సీతారామయ్య, ప్రిన్సిపల్ కొండన్న తదితరులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

హిందూపురం : గ్రామ స్థాయి దేశం అభివృద్ధి చెందాలంటే అది యువత వల్లే సాధ్యం అవుతుందని తహశీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రి కళాశాలలో విద్యార్థినులకు ఎన్నికల విభాగం అధికారికి శ్రీనివాస రెడ్డి ఆద్వర్యంలో ఓటు నమోదు, ఓటు సద్వినియోగం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ తిరుమలయ్య, సహాయ పౌర సమాచార అధికారి నరసింహులు, ఎన్నికల విభాగం సిబ్బంది బాబయ్య, సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : మడకశిర అసెంబ్లీ నియోజకవర్గం లో 18 సంవత్సరాల వయసు నిండిన యువతీ యువకులు ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిన్నయ్య, తహశీల్దార్ ఆనంద్ కుమార్ తెలిపారు . బుధవారం మడకశిర పట్టణంలోని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెంకటేశ్వర డిగ్రీ కళాశాల లో చదువుతున్న మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారి మారుతి, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, మధుసూదన్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రభుత్వ మద్యం దుకాణాల తనిఖీ

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎక్సైజ్ డీసీ మునిస్వామి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐదు మద్యం దుకాణాలు, ఒక బారును తనిఖీ చేసిన ఆయన మద్యం నిల్వలు, తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ ఎఇఎస్ నరసింహులు, కృష్ణమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

12న జిల్లా సీనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

పుట్టపర్తి రూరల్ : ఉమ్మడి అనంతపురం జిల్లా సీనియర్ స్త్రీల, పురుషుల షూటింగ్ బాల్ జట్ల ఎంపికను ఈ నెల 12న పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి మోడల్ స్కూల్ క్రీడావరణములో నిర్వహిస్తున్నట్లు అనంతపురం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 12 వ తేదీన ఉదయం 10 గంటలకు పాల్గొనవచ్చును. ఇక్కడ ఎంపిక అయిన స్త్రీలు, పురుషుల జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని అనంతపురం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, అమరేంద్ర, జ్యోతి , అజీంబాష, ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు.

స్వచ్ఛమైన నీటితో ఆరోగ్యం

అమరాపురం : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల్ జీవన్ పథకం కింద ప్రతి ఇంటింటికి నీటి కొళాయిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని జలజీవన్ మిషన్ మేనేజర్ నాగార్జున రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో ఎంపిపి ఈరన్న అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మను నాయక్, ఎఇ హరి, ఎంపిడిఒ మునిస్వామి, సర్పంచ్ లు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలు స్వచ్ఛమైన నీటిని తాగేందుకు వీలుగా ప్రతి కుటుంబానికి కొళాయలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. త్వరలో సర్పంచులు చేసి పనులకు బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నరసింహమూర్తి, చిత్తన్న యాదవ్, జితేంద్ర, శివలింగప్ప, అధికారులు తదితరులు పాల్గొన్నారు .

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

గుడిబండ : వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలపరిధిలోని మేకలగట్ట, పూజారిపల్లిలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వక్కలిగల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, స్థానిక సర్పంచి కవితాఓబన్న, ఎస్. రాయపురం సర్పంచి రాధమ్మ, సింగిల్ విండో అధ్యక్షులు చంద్రప్ప, ఎంపీడీవో రామారావు, తహశీల్దార్ మహబూబ్‌పీరా, నాయకులు ఉలిరాజు, నాగరాజు చిన్నహనుమంతు తదితరులు పాల్గొన్నారు ,

గర్భిణులకు భోజన సౌకర్యం

గోరంట్ల : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు పుట్టగొండ్లపల్లికి చెందిన సమాజ సేవకులు శివారెడ్డి, ఆయన సతీమణి విజయలక్ష్మి భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

ద్విచక్ర వాహనాల వేలం

తనకల్లు : వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను మండలంలోని పరాకోండ్లపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ జయనాథ్ రెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఓబుల దేవర చెరువు: మండల పరిధిలోని తంగేడుకుంట పంచాయతీ బుచ్చిరాజు పల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. సమస్యను గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో పోలప్ప, సర్పంచి అబీదరఫిక్ బోరుబావి తవ్వకాన్ని బుధవారం ప్రారంభించారు.

సామూహిక వివాహాల కరపత్రాలు ఆవిష్కరణ

ధర్మవరం టౌన్ : చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలోనిసద్గురు యోగి నారాయణ తాతయ్య ఆశ్రమంలో డిసెంబర్ 11న నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు సంబందించిన కరపత్రాలను బుధవారం ధర్మవరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలో కొత్తపేటలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ అధ్యక్షులు ఆదినారాయణ, జింక రాజేంద్రప్రసాద్, ఆదినారాయణ, ఓబులేసు, వెంకటరాముడు, అరుణ్ కుమార్, వేమిరెడ్డి ప్రసాద్ రెడ్డి తదితరులు సామూహిక వివాహాలకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

గాండ్లపెంట : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం. ఇంజనీర్ అసిస్టెంట్లు వీఆర్వోలతో నవరత్నాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎంపిపి జగన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు అర్హులకు సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సునీత, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు

హిందూపురం : విద్యతో పాటు క్రీడల్లో రాణించినప్పుడు గ్రామ స్థాయి నుంచి ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందదని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంజిఎం క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జగనన్న క్రీడా సంబరాలు-2022లో భాగంగా నియోజకవర్గ స్థాయి క్రీడా కారుల ఎంపికను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులతో పాటు యువకులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శరీర ధృడత్వానికి తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ జిల్లా కోఆర్డినేటర్ రామాంజినేయులు, ఎంజీఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, హిందూపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ బిఎ. లోకనాథ్, వివిధ పాఠశాల నుండి వచ్చిన సెలక్షన్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

కొత్తచెరువు : నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని డిఎస్‌డిఒ జగన్నాథ్ రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను బుధవారం నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, క్రికెట్, లాంగ్ జంప్, వాలీబాల్ తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ కుమార్, రాజీవ్ దేవ్, హెచ్ఎం చిన్నకృష్ణారెడ్డి, అంజన్న, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జగనన్న క్రీడా సంబరాలను స్థానిక జెడ్పీటీసీ శ్రీరాములు బుధవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అండర్ 17 విభాగంలో క్రికెట్ షటిల్ కబడ్డీ వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పిడి ప్రకాష్ రెడ్డి తెలియజేశారు. డివిజన్ స్థాయిలో నిర్వహించే ఈ పోటీలలో గోరంట్ల, పరిగి, సోమందేపల్లి, పెనుగొండ ప్రాంతాలకు చెందిన యువకులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో పాల్గొన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శివశంకర్, రామాంజి, చంద్రశేఖర్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ